# తోలు బొమ్మలాట

ఈ కళ చాలా ప్రాచీనమైంది. చోళమహారాజులు, విజయనగరం రాజుల కాలంనాటి నుండి ఈ కళ ఉన్నట్టుగా ఆధారాలున్నాయి. తోలుబొమ్మలాట ప్రదర్శన జరుగుటవల్ల అంటురోగాలురావని, అగ్ని ప్రమాదాలు జరగవని నమ్మకం. గ్రామాలలో సాయంత్రం ఆరుగంటల నుండి తెల్లవారుజాము వరకు ప్రదర్శిస్తూ ఉంటారు. తోలుబొమ్మలాటలోని రంగు రంగు బొమ్మల కదలికలు వాటికనుగుణంగా పాటలు, సంభాషణలు, వాద్యాలు విన్నప్పుడు దాదాపు ఈనాటి రంగుల చలనచిత్రం చూస్తున్నంత అనుభూతి కలుగుతుంది. ఈనాటి చలనచిత్రానికి ప్రాచీన రూపం తోలుబొమ్మలాటగా ఊహించుటలో ఏమంత అతిశయోక్తి లేదు.



శ్రీ పాల్కురికి సోమనాథ కవి తన పండితారాధ్య చరిత్రలో ఆనాడు 13వ శతాబ్దిలోపల రెండు రకాల బొమ్మలున్నట్లు తెలిపారు. అవి (1) తెల్లచీరవెనుక ఆడించే బొమ్మలు (2) ఇనుప చువ్వలతో ఆడించు బొమ్మలని వ్రాయుట జరిగింది. ఈ ఆధారాలనుబట్టి తోలుబొమ్మలాట ఆ రోజులలోనే ప్రసిద్ధిపొందిందని, శివరాత్రి మొదలయిన పర్వదినంలలో ఈ ప్రదర్శనలు ఉండేవని తెలుస్తోంది. తోలుబొమ్మలవారిలో ఆరె కాపుకులస్థులు యెక్కువగా ఉన్నారు. వీరు ఒకచోట స్థిరంగా ఉండరు. సంవత్సరంలో 9 నెలలు ఒక గ్రామం నుండి ఇంకొక గ్రామంలో ప్రదర్శనలిస్తూ తిరుగుతూ ఉంటారు. కొన్ని ప్రాంతములలో వీరిని బలిజ, బొందిలీ కులస్థులు కూడా ఈ వృత్తిలో ఉన్నారు. తోలుబొమ్మలాటలో ఉత్తరాది, దక్షిణాది అని రెండు పద్ధతులు ఉన్నాయి. ఉత్తరాది పద్ధతి విశాఖపట్టణం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, కృష్ణా మరియు గుంటూరు జిల్లాలో ప్రచారంలో ఉంది. దక్షిణాది రాయలసీమ జిల్లాలలో ప్రచారంలో

ఉంది. ఉత్తరాది పద్ధతిలో తోలుబొమ్మలు పెద్దవిగాను మరియు దక్షిణాది పద్ధతిలో తోలుబొమ్మలు చిన్నవిగాను ఉన్నాయి. ఉత్తరాది పద్ధతిలో నాటకీయత ఎక్కువగాను, దక్షిణాది పద్ధతిలో కథను విశదీకరించుట ఎక్కువగానూ ప్రాధాన్యత ఉంటుంది.

ఈ తోలుబొమ్మలాటలో శ్రీమద్రామాయణ, మహాభాగవతాల నుండి కథలు తీసుకొని చెప్పెదరు. ముఖ్యంగా "సుందరాకాండ" "యుద్ధకాండ" "లక్ష్మణ మూర్ఛ" "మైరావణ" "లవకుశ" మొదలయినవి రామాయణం నుండి "కీచక వధ" "విరాట పర్వం" "శశిరేఖాపరిణయం" మొదలైనవి మహాభారతం నుండి కథలను ప్రదర్శించెదరు. అన్నిటికన్నా మిన్నగా "పద్మవ్యూహం" రెండుసెట్లుగా బొమ్మలతో రెండువాద్యములతో చాలా చాకచక్యంతో ప్రదర్శిస్తారు. ఈ కథను మూడు రాత్రులు ప్రదర్శిస్తారు. నాటకీయత ఎక్కువగా ఉన్నందున ఈ కథల ప్రదర్శనకు ఎక్కువ ప్రాముఖ్యత నిస్తారు.

**కథను ప్రదర్శించుటకు కావలసిన సామాగ్రి**

1. పలుచని తెల్లగావున్న 6 మీటర్ల వస్త్రం
2. 500 కేండీలతో విద్యుత్ బల్బులు లేకపోతే పెట్రోమాక్స్ లైట్లు - 2
3. హార్మోనియం, మృదంగం, తాళాలు, గజ్జెలు, చెక్కలు, తొక్కడు చెక్క
4. మైక్‌సెట్, లైటింగు సామాగ్రి

**కథకులు**

| | | |
|---|---|---|
| 1. | ప్రధాన కథకుడు | - 1 |
| 2. | బొమ్మలు ఆడించేవారు | - 2 |
| 3. | రాగాలు | - 2 |
| 4. | తాళం | - 1 |
| 5. | హార్మోనిస్టు | - 1 |
| 6. | మృదంగం | - 1 |
| 7. | వాద్యకారుడు | - 1 |

8. సహాయం - 1

మొత్తము 10 మంది.

కథ మధ్యలో కేతిగాడు, బంగారక్క మరియు జుట్టుపోలిగాడు మొదలైన హాస్యరస ప్రధానమైన పాత్రలను ప్రవేశపెట్టి ప్రేక్షకులకు ఏమాత్రం విసుగుకలగకుండా కథను సాఫీగా నడిపిస్తారు.

తోలుబొమ్మలాటలో ప్రభుత్వ ప్రజారోగ్య సంక్షేమ అభివృద్ధి పథకాలను గూర్చి కూడా కొన్ని కథలు తయారుచేస్తూ ప్రదర్శించబడుచున్నవి.

తోలుబొమ్మలాట కళాకారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంతటా ఉన్నారు.

1. కుటుంబనియంత్రణ
2. జన్మభూమి
3. పర్యావరణ పరిరక్షణ
4. పల్స్‌పోలియో
5. ఎయిడ్స్
6. మతసామరస్యం మొదలయినవి.